

కొత్తగూడెంలో బతుకమ్మ సందడి..

న్యూస్‌రీల్

భక్తులకు ఇక్కట్లు లేకుండా..

- గోదావరి ఒడ్డున వాటర్ ట్యాంక్‌లు, బోరు ఏర్పాటు..

భద్రాచలంఅర్బన్: దక్షిణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. గోదావరి నదిలో నీరు తక్కువగా ఉన్న సమయంలో స్నానాలు చేసేందుకు భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఐటీసీ ఆధ్వర్యంలో బాత్రూమ్‌లను నిర్మించగా, భద్రాచలం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రెండు వాటర్ ట్యాంకులను నిర్మిస్తున్నారు. నీటి బోరును కూడా ఏర్పాటు చేయించారు. వరదల సమయంలో ప్రజలను గోదావరి నదిలోకి అనుమతించరు. ఆ సమయంలో కరకట్ట ఒడ్డున స్నానం చేసేలా షవర్ ఏర్పాటు చేశారు.

17న శబరి స్మృతి యాత్ర

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో గిరిజన ఉత్సవం శబరి స్మృతి యాత్రను ఈ నెల 17న వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ ఎల్.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానంలో ఉదయం 6 గంటలకు శబరి చిత్రపటంతో గిరిప్రదక్షిణ నిర్వహిస్తామని, అనంతరం దమ్మక్క విగ్రహం వద్ద పూజలు చేయడంతోపాటు ఆలయంలో స్వామివారి కల్యాణం జరిపిస్తామని పేర్కొన్నారు. అదే రోజు గిరిజనుల సమక్షంలో అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయం వరకు శ్రీసీతారామచంద్ర స్వామివారి ప్రచార రథంతో శోభాయాత్ర ఉంటుందని తెలిపారు.

రేపు చేప పిల్లల పంపిణీ

పాల్వంచరూరల్: జిల్లాలో శుక్రవారం చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెంలోని సింగభూపాలెం చెరువులో రెండు లక్షల చేప పిల్లలను వదులుతామని, అనంతరం జిల్లా వ్యాప్తంగా పంపిణీ ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు.

యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక



చంద్రశేఖర్

ఇల్లెందురూరల్: కాకతీయ విశ్వవిద్యాలయం ఫుట్‌బాల్ జట్టుకు ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ తృతీయ సంవత్సరం విద్యార్థి చంద్రశేఖర్ ఎంపికయ్యారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నప్పయ్య బుధవారం వివరాలు వెల్లడించారు. మంగళవారం వరంగల్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. గతంలో 2022-23లో కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరులో నిర్వహించిన సౌత్‌జోన్ ఫుట్‌బాల్ పోటీల్లో, పలుమార్లు ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో చంద్రశేఖర్ రాణించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.



టేకులపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, బతుకమ్మతో కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ సీతాలక్ష్మి

బతుకమ్మ వేడుకలు షురూ..

- ఎంగిలిపూల బతుకమ్మతో ఆడిపాడిన మహిళలు
- వీధివీధినా హోరెత్తిన సంప్రదాయ, జానపద గీతాలు

కొత్తగూడెంటౌన్: చిత్తూ చిత్తూల బొమ్మ.. శివుడీ ముద్దుల గుమ్మా.., బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మా ఉయ్యాలో తదితర జానపద గీతాలతో జిల్లావ్యాప్తంగా సందడి నెలకొంది. పల్లెలు, పట్టణాల్లో బుధవారం తెలంగాణ సంప్రదాయ వేడుక బతుకమ్మ ఉత్సవాలు అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మను పేర్చి ఆడపడుచులు ఆటపాటలతో సందడి చేశారు. ఇళ్లు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఎక్కడ చూసినా వీధుల్లో బతుకమ్మ పాటలు మార్మోగాయి. జిల్లా కేంద్రంలోని సూపర్‌బజార్, రైటర్‌బస్తీ, పాత కొత్తగూడెం, హనుమాన్ బస్తీ, విద్యానగర్ కాలనీ, హెడ్ ఆఫీస్ ఏరియా, పోస్టాఫీస్ ఏరియా, బస్టాండ్ సెంటర్, మధురబస్తీ, రామవరం, త్రీఇంక్లైన్, వనందాస్‌గడ్డబస్తీ, గౌతంపూర్, రుద్రంపూర్ ధన్‌బాద్‌లతోపాటు భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, అశ్వారావుపేట, అశ్వాపురం, ఇల్లెందు తదితర ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా జరి గాయి. మహిళలు, చిన్నారులు బతుకమ్మ సంబురాల్లో ఆనందంగా పాల్గొన్నారు. నూతన వస్త్రాలు ధరించి, రకరకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను చేబూని చౌరస్తాలకు చేరుకుని ఆడిపాడారు. అనంతరం చెరువుల వద్ద ఏర్పాటు చేసిన ఘాట్లలో నిమజ్జనం చేశారు.

పూలకు ఫుల్ గిరాకీ

బతుకమ్మ పండుగ నేపథ్యంలో పూలకు గిరాకీ పెరిగింది. కొత్తగూడెం సూపర్‌బజార్ సెంటర్‌లో, పోస్టాఫీస్ సెంటర్‌లలో, హెడ్ ఆఫీస్, రామవరం ఏరియాల్లో పూలను విక్రయించారు. కిలో చామంతి రూ.1000, బంతిపూలు కిలో రూ. 600, గనుగు పూలు, రూ.15, తామర పువ్వు రూ. 15, గుమ్మడి కాయ ధరలు రూ. 200 నుంచి రూ.350, తంగేడు పూల కట్ట రూ.15, గులాబీ పూలు ఒక్కోటి రూ. 20 వరకు విక్రయించారు.

శోభాయమానంగా పెద్దమ్మతల్లి ఆలయం

- నేటి నుంచి శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు
- రోజుకో రూపంలో దర్శనమివ్వనున్న అమ్మవారు



విద్యుత్ దీపాల కాంతుల్లో పెద్దమ్మతల్లి ఆలయం

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారి ఆలయం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులకు వరాలు ఇచ్చే అమ్మవారి సన్నిధిలో గురువారం నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలకు వేలాదిగా భక్తులు హాజరుకానున్నందున అన్ని ఏర్పాట్లు చేశారు. తొలిరోజైన గురువారం ఉదయం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దంపతులచే కలశస్థాపన పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

అమ్మవారి రూపాలు ఇలా...

ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మతల్లి అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిస్తారు. తొలిరోజు గురువారం (3వ తేదీ) శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. 4న శ్రీగాయత్రీదేవిగా, 5న శ్రీ అన్నపూర్ణదేవి అవతారంలో, 6న శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా, 7న శ్రీమంగళగౌరీదేవి అమ్మవారిగా, 8న శ్రీ మహాలక్ష్మీదేవిగా, 9న శ్రీ సరస్వతిదేవిగా, 10న శ్రీ దుర్గాదేవి అమ్మవారిగా, 11న శ్రీ దుర్గాదేవి, శ్రీమహిషాసురమర్దినిగా, 12న శ్రీరాజ రాజేశ్వరీదేవి అమ్మవారిగా అలంకరిస్తారు.

సింగరేణి గనుల వద్ద..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఉన్న గనులు, డిపార్ట్‌మెంట్లలో గురువారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలు గని టెంపుల్ కమిటీల ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తారు.

సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాలి

అశ్వారావుపేటరూరల్: అన్నదాతలు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ సాగు విధానంపై దృష్టి సారించాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ ఐవీఎస్ రెడ్డి అన్నారు. బుధవారం గిరిజన భవన్‌లో ఆయిల్‌పామ్ అశ్వారావుపేట జోన్ గ్రోయర్స్ సొసైటీ ద్వితీయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు నష్టం జరగకుండా ఉండాలంటే స్వల్పకాలంలో అధిక ఆదాయాన్ని పొందేలా పంటలను సాగు చేయాలన్నారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరి మహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు జూపల్లి రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు సీహెచ్ సత్యనారాయణ, శీమకుర్తి వెంకటేశ్వరరావు, అంకత మహేశ్వరరావు, సీతంశెట్టి సత్యన, ఆళ్ల నాగేశ్వరరావు, ఎంఎస్ సుబ్బారావు, అన్వేష్, దారా తాతారావు, మహేష్, రైతులు పాల్గొన్నారు.

‘సీబీఎస్‌ఈ’ని నిర్లక్ష్యం చేయొద్దు

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్
- టేకులపల్లి ఏకలవ్య మోడల్ స్కూల్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



మహనీయులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ జితేష్, ఎమ్మెల్యే కోరం తదితరులు

టేకులపల్లి: సీబీఎస్‌ఈ విద్యను నిర్లక్ష్యం చేయొద్దని, రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్ ఉందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బుధవారం టేకులపల్లి మండలం బద్దుతండా గ్రామంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) పాఠశాలను జార్ఖండ్ రాష్ట్రంలోని హజారీభాగ్ నుంచి వర్చువల్‌గా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో కలెక్టర్ ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. సీబీఎస్‌ఈ విషయంలో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. మాతృభాషను వృద్ధి చేసుకుంటూనే స్కూల్‌లో ఉన్నా, ఇంట్లో ఉన్నా ఇంగ్లిష్‌లోనే మాట్లాడాలని, వీటి విలువ పదేళ్ల తర్వాత తెలుస్తుందని వివరించారు. సీబీఎస్‌ఈ విద్య ద్వారా ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాలలకు పునాది తెలంగాణలోనే పడిందన్నారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రెసిడెన్షియల్ పాఠశాలలు పెట్టారని, ఆ తర్వాత ఆదివాసీ గిరిజనులకు సరైన విద్య అందడం లేదనే ఉద్దేశంతో గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ పాఠశాలల్లో కొన్నింటిని ఈఎంఆర్ఎస్ పాఠశాలలుగా మార్చినట్లు తెలిపారు. అన్ని వసతులు, సౌకర్యాలతో అందిస్తున్న విద్యను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలను శాలువాతో సన్మానించారు. తొలుత మహాత్మా గాంధీ, అంబేద్కర్, బిర్సా ముండా, కొమురం భీమ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ, గిరిజన విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వర్షం కారణంగా ప్రారంభోత్సవ కార్యక్రమం చివరిలో కొంత అసౌకర్యం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ఈఎంఆర్ఎస్ ఓఎస్‌డీ కృష్ణారావు, ఆర్‌సీఓ నాగార్జునరావు, ప్రిన్సిపాల్ నిశాంత్, డీఎస్పీ చంద్రభాను, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ జి.రవీంద్రరావు, సీఐ టి.సురేష్, ఎస్ఐ పోగుల సురేష్, బీఎస్ఎన్ఎల్ అధికారి సక్రునాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులు..

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు నీటి క్యాన్లు , బల్లాలు, కుర్చీలు మోస్తూ కనిపించారు. రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాల సమయంలోనూ ఆహారం వడ్డించే పనులు కూడా విద్యార్థులతోనే చేయిస్తున్నట్లు సమాచారం.

డిజిటల్ సర్వే బృందాలను ఏర్పాటు చేయాలి

జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం పైలట్ పద్ధతిలో అమలు చేయనున్న కుటుంబానికి ఒక డిజిటల్ కార్డు సర్వేకు తక్షణమే బృందాలు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ సూచించారు. బుధవారం జిల్లాలో డిజిటల్ సర్వే అమలుపై ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ సర్వేకు కావాల్సిన నోడల్ అధికారులను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కుటుంబీకుల సంఖ్య, వారి మధ్య సంబంధం తదితర వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఒక రాష్ట్రం–ఒక కార్డు ద్వారా ప్రతి కుటుంబానికి రాష్ట్రంలో గుర్తింపు ఉంటుందన్నారు. ప్రతీ సభ్యుడికి గుర్తింపు సంఖ్య ఉంటుందన్నారు. కుటుంబ వివరాలతోపాటు కొత్తగా కుటుంబంలోకి వచ్చిన వారు, జన్మించిన పిల్లల వివరాలు పొందుపర్చాలని, మరణించిన, వివాహం చేసుకుని వెళ్లిన వివరాలను తొలగించాలని అన్నారు. కుటుంబ సభ్యుల అనుమతితో గ్రూప్ ఫొటో తీయాలని తెలిపారు. ఐదు రోజుల్లో కుటుంబ సర్వే పూర్తి చేయాలని అవసరమైతే అదనపు బృందాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో బతుకమ్మ చీరల పంపిణీ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ జితేష్ మాట్లాడుతూ సర్వేకు ప్రతీ నియోజకవర్గానికి నోడల్ ఆఫీసర్లను నియమించామని తెలిపారు. కొత్తగూడేనికి కొత్తగూడెం ఆర్డీఓ మధు, భద్రాచలానికి దామోదర్‌ను పినపాకకు ట్రైబల్ వెల్ఫేర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్, అశ్వారావుపేటకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమ,ఇల్లెందుకు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్యను నియమించినట్లు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో జెడ్పీ సీఈఓ కె.చంద్రశేఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కాశయ్య, సుమ, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, డీఎస్ఓ రుక్మిణి, డీఎం సివిల్ త్రినాథ్‌బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అహింసా మార్గాన్ని ప్రపంచానికి చాటారు..

గాంధీ జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అహింసా మార్గాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు మహాత్మాగాంధీ అని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. జాతిపిత గాంధీజీ చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహాత్ముడు ఏమి చెప్పారో అదే ఆచరించారని అన్నారు. దేశానికి పట్టుగొమ్మలు గ్రామాలని, వాటి అభివృద్ధితోనే దేశం ప్రగతి సాధిస్తుందని చెప్పారని గుర్తుచేశారు. అంటరానితనం నిర్మూలనకు కృషి చేశారని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాంధీ కన్న కలలను, ఆశయాల సాధన కోసం కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది జిల్లా యంత్రాంగానికి రోల్‌మోడల్‌లా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రమాదేవి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

‘సాదాబైనామా’కు మోక్షమెప్పుడో..?

ఏళ్లతరబడి రైతుల ఎదురుచూపులు

- ‘ధరణి’తో భూ యాజమాన్య హక్కు రాక అవస్థలు
- జిల్లాలో రెండు విడతలుగా 62,511 మంది దరఖాస్తు
- క్రమబద్ధీకరణ అర్జీలు స్వీకరించి అటకెక్కించిన గత ప్రభుత్వం
- ఈ ప్రభుత్వమైనా భూములకు పట్టాలివ్వాలని వేడుకోలు



పాల్వంచరూరల్: సాదాబైనామాల దరఖాస్తుల సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు ఏళ్లతరబడి నిరీక్షిస్తున్నారు. ధరణి పోర్టల్ కారణంగా భూ యాజమాన్య హక్కు(పట్టా) రాక అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న రైతులు అవస్థ పడుతున్నారు. గత ప్రభుత్వం సాదాబైనామాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు స్వీకరించి చేతులు దులుపుకుంది. ప్రస్తుత ప్రభుత్వమైనా క్రమబద్ధీకరణ పూర్తి చేస్తుందని రైతులు ఆశలు పెట్టుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వేలాది మంది రైతులు భూముల క్రయ, విక్రయాలు కేవలం సాదా కాగితాలు, స్టాంప్ పేపర్లపై జరిగాయి. భూమిని సాగు చేసుకుంటున్నా రైతులకు పట్టాదారు పాస్‌బుక్ రాలేదు. ఓ రైతు భూమి సర్వే నంబర్ మరో రైతు పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదు కావడం, భూమిని అమ్మిన వారు చనిపోవడం, వారి వారసులు వచ్చి అమ్మిన భూమినే మరొకరికి అమ్ముకోవడం వంటి ఎన్నో సమస్యలు తలెత్తాయి. దీంతో భూమి యాజమాన్య హక్కు నమోదు (రిజిస్ట్రేషన్) కాకపోవడంతో బ్యాంకర్లు రుణాలు ఇవ్వడంలేదు. ప్రభుత్వం ఇచ్చే రైతుబంధు కూడా అందడంలేదు. కొనుగోలు చేసిన భూములను పట్టా చేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ అన్నదాతలు చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. ధరణి పోర్టల్ స్థానంలో ఈ ప్రభుత్వం భూమాత పోర్టల్‌ను తీసుకొచ్చి ఆర్‌ఓఆర్–2024 చట్టాన్ని అమలు చేసి సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

2016 నుంచి 2020 వరకు దరఖాస్తుల స్వీకరణ

గత ప్రభుత్వం 2014 జూన్ 2వ తేదీకి ముందు సాదా కాగితాలపై క్రయ,విక్రయాలు జరుపుకున్న భూములను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించింది. 2016లో ఒకసారి, 2020లో మరోసారి దరఖాస్తులు స్వీకరించింది. కొందరికి పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేసింది. ఆ తర్వాత పట్టించుకోలేదు.

62,511 దరఖాస్తులు...

జిల్లాలో సాదాబైనామాల క్రమబద్ధీరణకు 62,511 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. అశ్వారావుపేట మండలంలో 1,850, ములకలపల్లిలో 2,172, దమ్మపేట 2,589, అన్నపురెడ్డిపల్లి 4,054, చండ్రుగొండ 4,978, భద్రాచలం 78, చర్ల 84, దుమ్ముగూడెం 362, కొత్తగూడెం 154, చుంచుపల్లి 1,170, లక్ష్మీదేవిపల్లి 3,026, సుజాతనగర్ 3,588, పాల్వంచ 7,062, కరకగూడెం 527, పినపాక 1,452, అశ్వాపురం 2,366, బూర్గంపాడు 4,604, మణుగూరు 2,439, ఆళ్లపల్లి 895, గుండాల 980, జూలూరుపాడు 3,752, ఇల్లెందు 5,748, టేకులపల్లిలో 8,581 మంది దరఖాస్తు చేసుకున్నారు.

గిరిజన రైతులకూ పట్టాలు లేవు

ఏజెన్సీ జిల్లాలో 1/70 యాక్టు అమల్లో ఉన్నా భూముల క్రయ,విక్రయాలు గిరిజనుల మధ్యే జరిగినా, సాదాకాగితాలపై ఒప్పందాలు రాసుకున్నా భూములకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వడంలేదని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనుల వద్ద గిరిజనేతరులు కొనుగోలు చేసిన భూములకు గతంలో పట్టాపాస్‌పుస్తకాలు కూడా ఇచ్చారని గిరిజన రైతులు ఆరోపిస్తున్నారు. పాండురంగాపురం, రెడ్డిగూడెం, యానంబైల్, నాగారం, జగన్నాధపురం, కేశవాపురం, సోములగూడెం గ్రామాల పరిధిలోని భూములకు పట్టా పాసుపుస్తకాలు రాక రైతులు అనేక సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారు.

రైతుల గోడు పట్టించుకోవాలి



నాకు సర్వే నంబర్ 9లో నాలుగున్నర ఎకరాల భూమి ఉంది. పొజిషనలో ఉన్నాను. మా నాన్న 1995లో బంగారమ్మ వద్ద నుంచి సాదాకాగితాలపై కొనుగోలు చేశాడు. క్రమబద్ధీకరణకు 2020లో సాదాబైనామా దరఖాస్తు చేసుకున్నాను. ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదు. రైతుల గోడు పట్టించుకోవాలి. – కాకా శ్రీను, గంగాదేవిగుప్ప, దంతెలబోరు పంచాయతీ

పంట రుణాలు ఇవ్వట్లేదు



పాండురంగాపురం గ్రామపంచాయతీ పరిధిలో 126/31/ఆ సర్వే నంబర్‌లో భూములకు గతంలో ఆన్‌లైన్ పహాణీలు ఉన్నాయి. సాదాబైనామా కింద దరఖాస్తు చేసుకున్నా. నేటికీ పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వలేదు. దీంతో రైతుబంధు, బ్యాంక్ రుణాలు రావడం లేదు. ఈ ప్రభుత్వమైనా పట్టాలు ఇస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నాం. – కొత్త కృష్ణ, పాండురంగాపురం

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం..



గతంలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి స్వీకరించిన సాదాబైనామాల దరఖాస్తులపై ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం తీసుకొచ్చే కొత్తచట్టం ప్రకారం పరిష్కరిస్తాం. గతంలో మా పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాం. పెండింగ్ దరఖాస్తులపై ప్రభుత్వ నిర్ణయం మేరకు నడుచుకుంటాం. –డి.వేణుగోపాల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)

‘డీఎస్సీ’ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి



సింగరేణి పాఠశాలలో వెరిఫికేషన్ నిర్వహిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

తొలి రోజు ఎస్‌జీటీ అభ్యర్థుల ధ్రువ పత్రాలు వెరిఫికేషన్

కొత్తగూడెంఅర్బన్: డీఎస్సీ–2024లో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం ప్రారంభమైంది. అభ్యర్థులను 1:3 నిష్పత్తిలో పిలువగా, తొలిరోజు జిల్లా కేంద్రంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జీటీ) అభ్యర్థులకు సంబంధించిన పరిశీలన చేపట్టారు. ఒరిజినల్ ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, అభ్యర్థుల నుంచి రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకుని, రసీదును అందజేశారు. 623 మంది అభ్యర్థులకు గానూ తొలి రోజు 150 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. పరిశీలన ఈనెల 5వ తేదీ వరకు కొనసాగుతుందని, సంబంధిత అభ్యర్థులు గడువులోగా వచ్చి ధ్రువీకరణ చేయించుకోవాలని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకులు అడిషనల్ డైరెక్టర్, శ్రీనివాసాచారి సందర్శించారు. ధ్రువ పత్రాల పరిశీలనను పర్యవేక్షించారు. అభ్యర్థుల ర్యాంకు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొదటి రోజు కావడంతో అభ్యర్థులు, వారి వెంట వచ్చిన బంధువులతో పరిశీలన కేంద్రంలో సందడి నెలకొంది. కొందరు జిరాక్స్ సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారుల సంతకాలు చేయించుకోకపోవడంతో ఎంఈఓ ప్రభుదయాల్ అందుబాటులో ఉండి గెజిటెడ్ అధికారిగా సంతకం చేసి సహకరించారు. అభ్యర్థులకు అసౌకర్యం కలుగకుండా వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగింది. అధికారులు అభ్యర్థల నుంచి తీసుకున్న జిరాక్స్ సెట్ల ఆధారంగా వివరాలను ఆన్‌లైన్‌లో విద్యాశాఖాధికారులు నమోదు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్‌లు సతీష్ కుమార్, నాగరాజశేఖర్, ఎస్. కె. సైదులు, శ్రీనివాస్, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

చంద్రుగొండ వాసికి డాక్టరేట్


జహీర్ అహ్మద్

చంద్రుగొండ: చంద్రుగొండకు చెందిన మహమ్మద్ జహీర్ అహ్మద్‌కు డాక్టరేట్ లభించింది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను చెన్నైలోని వెల్‌టెక్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇమాంసాహెబ్ కుమారుడైన జహీర్‌ను పలువురు అభినందించారు.

పరిశుభ్రత నిరంతరం కొనసాగించాలి


చెత్త తొలగిస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

పాల్వంచరూరల్: మహాత్మాగాంధీ స్ఫూర్తితో పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దమ్మగుడి పరిసరాల్లో బుధవారం శ్రమదానం నిర్వహించారు. ఆమె గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధికారులతో కలిసి పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం జగన్నాథపురం మల్టీపర్పస్ వర్కర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయ భాస్కరరెడ్డి, పెద్దమ్మగుడి ఈఓ రజనీకుమారి, ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ పొరండ్ల రంగా, ఏపీఎం రాంబాబు, కార్యదర్శి సాయిరాం, ఈసీ పుల్లయ్య, టీఏ శ్రీను, శంకర్, సీసీలు శ్రీను, పద్మ, రవికుమార్ పాల్గొన్నారు.

రహదారిపై నిలిచిన భారీ కంటైనర్..


రహదారిపై నిలిచిన భారీ వాహనం

పాల్వంచరూరల్: బీసీఎం జాతీయ రహదారిపై భారీ వాహనం నిలిచిపోవడంతో రెండు రోజులుగా వాహనాల రాకపోకలకు కొంత ఇబ్బందిగా మారింది. మణుగూరు బీటీపీఎస్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను చెన్నైకి తీసుకెళ్తున్న భారీ కంటైనర్ మంగళవారం రాత్రి పాల్వంచ మండలం కేశవాపురం వద్ద నిలిచిపోయింది. నిత్యం రద్దీగా ఉండే రహదారిపై భారీ వాహనం నిలిచిపోవడంతో రాకపోకలు ఇబ్బందికరంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు.

మహాత్మా మన్నించు!

పాల్వంచరూరల్: మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా మద్యం, మాంసం విక్రయాలు నిషేధం. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మద్యం, మాంసం విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయ పరిసరాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం జోరుగా విక్రయించారు. అయినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోలేదు. ఆలయ సమీపంలో జంతు వధ జరిగినా అధికారులు పట్టించుకోలేదు. అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి.

చికెన్, మటన్ దుకాణాలపై దాడులు

ఇల్లెందు: గాంధీ జయంతి రోజున కొందరు మటన్, చికెన్ విక్రయాలు సాగిస్తుండటంతో మున్సిపల్ సిబ్బంది పట్టుకుని కేసు నమోదు చేశారు. పెట్రోల్‌బంక్ ఎదుట గల ఓ మటన్ షాపు నుంచి 30 కిలోలు, జగదాంబసెంటర్లోని చికెన్ షాపు నుంచి 10కిలోల చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గుంత తొవ్వి మటన్, చికెన్‌ను పూడ్చిపెట్టినట్లు మున్సిపల్ జవాన్ ప్రకాష్ తెలిపారు.

మద్యం పట్టివేత

పాల్వంచ: గాంధీ జయంతి నాడు ఓ కిరాణా షాపులో మద్యం అమ్ముతుండటంతో పోలీసులు పట్టుకున్నారు. బుధవారం కేఎస్‌పీరోడ్‌లో ఓ కిరణా షాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందటంతో ఎస్‌ఐ సుమన్ దాడి చేశారు. ఈ సందర్భంగా రూ.17 వేల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిర్వాహకురాలు లక్ష్మీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

దమ్మపేట: రహస్యంగా పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని నాచారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నార నే సమాచారం మేరకు పోలీసులు దాడిచేశా రు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని, రూ.33,300 నగదు, 5 సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి వెల్లడించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

భద్రగిరిలో ఆధ్యాత్మిక సందడి

- శ్రీ దేవీ శరన్నవరాత్రి వేడులకు రామాలయం ముస్తాబు
- రేపటి నుంచి 12 వరకు ఉత్సవాలు
- రోజుకో అలంకరణలో అమ్మవారి దర్శనం
- 12న శమీ, ఆయుధ పూజలు, శ్రీలీలా మహోత్సవం

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఆధ్యాత్మిక సందడి ప్రారంభం కానుంది. ఈనెల 4 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే శ్రీ దేవీ శరన్నవరాత్రి వేడుకలకు ముస్తాబవుతోంది. కోరిన వరాలిచ్చే శ్రీ మహాలక్ష్మి అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా, రాక్షసుడైన మహిషాసురిడిని అంతమొందించి భక్తులను కాపాడిన అమ్మవారి ధైర్యానికి ప్రతీకగా ఈ ఉత్సవాలను ఉపాలయమైన లక్ష్మి తాయారు అమ్మవారి సన్నిధిలో నిర్వహించడం ఆనవాయితీ. ప్రతి రోజూ సామూహిక కుంకుమార్చన ఉంటుంది. ఇక ఈ తొమ్మిది రోజుల పాటు చిత్రకూట మండపంలో వాల్మీకి పారాయణం, రామాయణ ప్రవచనం చేసేలా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. 3వ తేదీన బాలకాండ పారాయణంతో ఇది ప్రారంభమవుతుంది. 12వ తేదీన విజయదశమిని పురస్కరించుకుని దసరా మండపంలో కనుల పండువగా లీలా మహోత్సవం నిర్వహిస్తారు.

– భద్రాచలం


ఉత్సవాలకు వేదిక కానున్న శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయం

4వ తేది : ఆదిలక్ష్మి అలంకారం



భగవంతుడిని గుర్తించడానికే ఆలంబమైన లక్ష్మీ తత్వాన్ని ఆదిలక్ష్మి అంటారని, ఆ అమ్మవారి వల్లనే వేదవేద్యుని గుర్తించగలిగారని శ్రీ పరాశర భట్టార్ చెబుతారు. చతుర్భుజాలతో పై రెండు చేతుల్లో పద్మాలను ధరించి వరద–అభయ హస్తాలతో విరాజిల్లుతున్న ఆదిలక్ష్మి అమ్మవారు తొలి అలంకరణగా దర్శనమిస్తారు. ఈ రోజు అయోధ్యకాండ పారాయణం చేస్తారు.

5న : సంతానలక్ష్మి అలంకారం



'అఖిల జగన్మాతరం, అస్మన్మాతరం' అంటూ ప్రార్థిస్తారు భగవత్ రామానుజాచార్యులు. సకల చరాచర జగత్తు ఆ అమ్మ సంతామని, అందుకే ఆమె సంతానలక్ష్మి అని, ఈ రూపంలో ఉన్న అమ్మను ఆరాధిస్తే సంతాన అవరోధాలన్నీ తొలగి సుఖశాంతులు కలుగుతాయని ప్రతీతి. ఈ రోజు కూడా అయోధ్యకాండ పారాయణమే ఉంటుంది.

6న : గజలక్ష్మి అలంకారం



'లక్ష్మీ దివ్యై గజేంద్రై మణిగణఖచితై.. స్నాపితా హేమకుంభై' అని కీర్తిస్తారు పూర్వాచార్యులు. ఈ అమ్మను ఆరాధిస్తే అధికారం, మహా సంపద కలుగుతాయని ప్రతీతి. గజలక్ష్మిని ఆరాధించే దేవేంద్రుడు త్రైలోకాధిపత్యాన్ని సాధించాడని, ఈ అమ్మను పూజిస్తే చెదరని అధికారం, తరగని సంపద కలుగుతాయని పండితులు అంటున్నారు. ఈ రోజున అరణ్యకాండ పారాయణం ఉంటుంది.

7న: ధనలక్ష్మి అలంకారం



'హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం ..'అంటూ శ్రీ సూక్తం అమ్మవారిని ధనలక్ష్మిగా కీర్తిస్తుంది. ధనం అంటే కేవలం డబ్బు మాత్రమే కాదు. విద్య, బలం, కీర్తి మొదలైనవన్నీ ధనమేనని, విద్యా, హిరణ్య, శక్తి ధనాలను ప్రసాదిస్తుంది కాబట్టే ఈ అమ్మకు ధనలక్ష్మి అని పేరని చెబుతారు. ఈ రోజున కిష్కింధకాండ పారాయణం చేస్తారు.

8న : ధాన్యలక్ష్మి అలంకారం



'ధన ధాన్యకరీం సిద్ధీం' అంటూ కీర్తిస్తుంది పురాణం. అన్ని రకాల ధాన్యాన్ని ప్రసాదించేది ఈ అమ్మేనని, ఈ అమ్మను ఆరాధిస్తే ఈతి బాధలన్నీ తొలగి, సమయానికి తగు వర్షాలు కురిసి దేశం సస్య శ్యామలంగా, సుభిక్షంగా ఉంటుందని పండితులు చెబుతున్నారు. ఈ రోజున సుందరకాండ పారాయణం ఉంటుంది.

9న : విజయలక్ష్మి అలంకరణ



'జ్ఞానేశ్వరీ..విజయ ప్రదా' అని కీర్తిస్తారు పరాశరభట్టార్. విజయం అంటే కేవలం యుద్ధ విజయమే కాదని, అన్ని రంగాల్లో విజయమని, ఈ రూపంలో ఉన్న అమ్మను సేవిస్తే అన్ని రంగాల్లో సునిశతమైన జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని నమ్మకం. ఈ రోజున యుద్ధకాండ పారాయణం చేస్తారు.

10న: ఐశ్వర్యలక్ష్మి అలంకారం



'అస్యేశానా జగతో విష్ణుపత్నీ' అని కీర్తిస్తుంది యజుర్వేదం. ఐశ్వర్యం అంటే శాఖాపరమైన శక్తి సామర్థ్యాలని, అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు శాసకరాలు, కరుణారూపిణి అయిన ఈ అమ్మ క్రీగంటి చూపుల కదలికలనే శాసనాలుగా భావించి శ్రీ మహావిష్ణువు సకల జగద్రక్షణ చేస్తుంటాడని శ్రీ పరాశరభట్టార్ కీర్తించారు. ఈ రూపంలో ఉన్న అమ్మను ఆరాధిస్తే శాసకత్వము, వాక్కుకు ప్రభావం, అనంత ఐశ్వర్యం కలుగుతాయని శాస్త్రం. ఈ రోజున కూడా యుద్ధకాండ పారాయణమే ఉంటుంది.

11న: వీరలక్ష్మి అలంకారం



'దారిద్ర్య ధ్వంసినీం దేవీం సర్వోపద్రవ వారిణీం..' అని అమ్మవారిని వీరలక్ష్మిగా కీర్తిస్తుంది పురాణం. దారిద్ర్యాన్ని, అన్ని రకాల ఉపద్రవాలను పారదోలే వీరత్వం ఈ అమ్మ సొంతమని, త్రిమూర్తులకు సైతం సాధ్యం కానీ మహిషాసురిడిని, ముగ్గురమ్మల శక్తి స్వరూపంగా ఆవిర్భవించి సంహరించిందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ అమ్మను ఆరాధిస్తే అన్ని రకాల దుష్ట శక్తులు, భయాలు, ఉపద్రవాలు తొలగిపోతాయని నమ్మకం. ఈ రోజున కూడా యుద్ధకాండ పారాయణం చేస్తారు.

12న : నిజరూప (మహాలక్ష్మి) అలంకారం



ధనం, ధాన్యం, సంతానం, విద్య, అధికారం, విజయం, ఐశ్వర్యం... ఇలా మనిషికి అవసరమైన అష్టైశ్వర్యాలను ప్రసాదించడానికి అష్టలక్ష్మీ రూపాలను ధరించిన ఆదిలక్ష్మి, కరుణా స్వరూపమైన తన నిజరూపంలో భక్తులందరినీ అనుగ్రహిస్తుందని పండితులు చెబుతున్నారు. ఈ రోజే విజయదశమి వేడుకలు కూడా నిర్వహిస్తారు.


రథానికి రంగులు వేస్తున్న కార్మికుడు

మాయమవుతున్న 'సీతారామ' మట్టి!

ప్రాజెక్ట్ కాలువ బలోపేతానికి పోసిన గ్రావెల్ అక్రమంగా తరలింపు


సీతారామ కాలువ సమీపంలో తవ్విన మట్టి

ములకలపల్లి: మండల పరిధిలో మట్టి దందా సాగుతోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సీతారామ ప్రాజెక్ట్ కాలువ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి వేళ లారీల్లో మట్టి, గ్రావెల్ తోలకాలు చేపడుతున్నారు. అక్రమార్కులు ఇసుక రవాణాతోపాటు మట్టిని కూడా యథేచ్ఛగా తరలిస్తున్నారు. మండల పరిధిలోని సత్యంపేట, రామాంజనేయపురం గ్రామ శివారులోని సీతారామ కాలువ ఎస్కేప్ శివారులో దందా కొనసాగిస్తున్నారు. కాలువ తవ్వకాల్లో బయటకు తీసిన మట్టి, గ్రావెల్‌ను కట్ట బలోపేతంగా ఉండేలా పోశారు. మట్టి, గ్రావెల్ నాణ్యంగా ఉండటంతో పలువురు అక్రమంగా తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో లారీల్లో పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలకు తరలిస్తూ రియల్టర్లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. వెంచర్లలో నింపి భారీగా సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జలవనరుల శాఖ అధికారులు స్పందించి 'సీతారామ' మట్టి తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రెండు ఇసుక లారీలు పట్టివేత


పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలు

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న లారీలను బుధవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ యాయతి రాజు కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం వింజరం వద్ద గల గోదావరి ఇసుక ర్యాంప్ నుంచి రెండు లారీల్లో అశ్వారావుపేట మీదుగా ఏపీకి ఇసుక తరలిస్తున్నారు. స్థానిక రింగ్ రోడ్డు వద్ద తనిఖీ చేయగా, తెలంగాణ పర్మిట్ (టీపీ) లేకపోవడంతోపాటు అధిక లోడుతో ఉన్నట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం పట్టుబడిన రెండు లారీను జిల్లా మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాల్వంచలో రెండు లారీలు..

పాల్వంచ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం గోదావరి నుంచి అక్రమంగా లారీల్లో ఇసుకను తరలిస్తుండగా దమ్మపేట సెంటర్ వద్ద ఒక లారీని, కేఎస్‌పీ రోడ్‌లో మరో లారీని ఎస్‌ఐ సుమన్ పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేక పోవడంతో సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్లు నాగు, నవీన్‌తో పాటు యజమానులపై కేసు నమోదు చేశారు.

భద్రాచలంలో ఇసుక ట్రాక్టర్లు...

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని బుధవారం టౌన్ ఎస్‌ఐ పీవీఎన్ రావు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను కూనవరం రోడ్డులో పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మేకల అనిల్, వడ్లపూడి రామకృష్ణతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాల్వంచ మండలంలో..

పాల్వంచరూరల్: మండలంలోని పాండురంగాపురం సమీపంలోని కిన్నెరసాని వాగు నుంచి బుధవారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్‌ఐ సురేశ్ పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమాని కుంజ గంగులు, డ్రైవర్ పూనెం శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెప్టిక్‌ట్యాంకులో పడి గేదె మృతి

ఇల్లెందురూరల్: మండలంలోని కొమ్ముగూడెం పల్లె దవాఖాన సెప్టిక్ ట్యాంకులో పడి బండి రాజయ్యకు చెందిన గేదె బుధవారం మృతిచెందింది. పల్లె దవాఖాన వెనుక భాగంలో ఉన్న సెప్టిక్ ట్యాంకు పైభాగం పగలిపోయి ఉండటంతో అటుగా వెళ్లిన గేదె అందులో కూరుకుపోయింది. సాయంత్రం గేదె కోసం వెతుకుతుండగా సెప్టిక్ ట్యాంకులో ఇరుక్కుపోయి మృతిచెందినట్లుగా గ్రామస్తులు గుర్తించారు. గేదె విలువ రూ.లక్ష ఉంటుందని స్థానికులు తెలిపారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి


వృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

అశ్వాపురం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. అశ్వాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఉపాధి హామీ పథకం గ్రామసభకు కలెక్టర్ హాజరయ్యారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని తొలుత ఆయుర్వేద వైద్యశాలలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయుర్వేద వైద్యశాలను కలెక్టర్ సందర్శించి మందులు పరిశీలించారు. వయోవృద్ధులను సన్మానించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఉపాధి హామీ గ్రామసభలో మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మాగాంధీ జీవితం మనకు మార్గదర్శకమన్నారు. రైతులు వారి పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీపీఓ చంద్రమౌళి, డీఎల్‌పీఓ సుధీర్, ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ అరుణ, తహసీల్దార్ స్వర్ణలత, ఎఫ్‌ఆర్‌ఓ రమేశ్, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీఓ ముత్యాలరావు, దాసరి మల్లేషం, మధు పాల్గొన్నారు.

మాతా శిశు ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్

సింగరేణి(కొత్తగూడెం): మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా స్వచ్ఛతా దేశ ఆరోగ్య రక్షిత కార్యక్రమంలో భాగంగా బుధవారం రామవరంలోని మాతా శిశు ఆస్పత్రిని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సందర్శించారు. అంతకు ముందు చుంచుపల్లి మండలంలోని బాబూక్యాంపు హైస్కూల్లో కలెక్టర్ మొక్కలు నాటి మాట్లాడారు. పర్యావరణ హిత చర్యల్లో భాగంగా పూలు, పండ్ల మొక్కలతో పాటు ఔషధ మొక్కలు (హెర్బల్ గార్డెన్) ఒక ప్రణాళిక ప్రకారం నాటాలని సూచించారు. అనంతరం రామవరం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణలో ప్లాస్టిక్ కవర్లు, ఇతర చెత్తను తొలగించారు. కార్యక్రమంలో డీఎండబ్ల్యూఓ సంజీవరావు, డీఈఓ వెంకటాచారి, ముస్తఫా, వెంకటయ్య, రాజశేఖర్, నాగా సీతారాములు, దస్తగిరి, లగడపాటి రమేశ్, చంద్, హరిబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ..

ఇద్దరు యువకులు మృతి


తీవ్ర గాయాలతో ప్రవీణ్

గుండాల: ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఆళ్లపల్లి మండలంలోని లక్ష్మీపురానికి చెందిన కుంజ ప్రవీణ్ (19), ఎట్టి బన్ని (17) మాంసం కోసం అనంతోగులోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తున్నారు. అనంతోగు–ఆళ్లపల్లి మధ్య తిర్లాపురం స్టేజీ మూలమలుపు వద్దకు రాగానే మర్కోడు నుంచి కొత్తగూడెం వైపు బస్సు, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్, బన్నీని హుటాహుటిన కొత్త గూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిని అక్కడి నుంచి ఖమ్మం తరలిస్తుండగా మృతి చెందారు. ఆళ్లపల్లి ఎస్‌ఐ రతీశ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రమాద సమయంలో బస్సు, ద్విచక్రవాహనం వేగంగా వస్తున్నాయని స్థానికులు తెలిపారు.

బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు

ములకలపల్లి: పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు నుఉప సంహరించుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారని, న్యాయం చేయాలని కోరుతూ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన గడ్డం ప్రశాంత్‌పై కొందరు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై ప్రశాంత్ పోలీసులను ఆశ్రయించగా.. గత నెలలో కేసు నమోదైంది. అప్పటి కేసును ఉపసంహరించుకోవాలని ప్రశాంత్‌పై ఒత్తిడి చేస్తున్నారు. లేనిపక్షంలో చంపుతామని బెదిరిస్తున్నారు. ప్రశాంత్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

మొండికుంటలో విషాదం


కుమారుడి పుట్టినరోజు వేడుకల్లో మహేశ్‌రెడ్డి (ఫైల్)

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు పులసాని రాంరెడ్డి కుమారుడు పులసాని మహేశ్ రెడ్డి (34) బుధవారం హైదరాబాద్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. యువకుడి మృతితో బతుకమ్మ పండుగ రోజు గ్రామంలో విషాదం నెలకొన్నది. గత నెల 29న మహేశ్‌రెడ్డి కుమారుడి మొదటి పుట్టిన రోజు వేడుకలు వైభవంగా నిర్వహించారు.

ఇంకొకరి మృతదేహం లభ్యం

సాగర్ కాల్వలో రెండు రోజుల కిందట గల్లంతైన ముగ్గురు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం దానవాయిగూడెం వద్ద సాగర్ కాల్వలో సోమవారం గల్లంతైన ముగ్గురిలో ఇంకో వ్యక్తి మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. భద్రాద్రి జిల్లా మణుగూరు మండలానికి చెందిన చల్లా రమేశ్, బండారు భరత్‌కుమార్, వెంకన్న, కట్టా ప్రసాద్ ఖమ్మంలోని దానవాయిగూడెం వద్ద జిల్లా జైలులో ఉన్న మిత్రుడిని చూసేందుకు వచ్చారు. తిరిగి వెళ్లే సమయాన వెంకన్న ఆటోలోనే ఉండిపోగా మిగతా ముగ్గురు సాగర్ కాల్వ వద్ద ఈతకు దిగి గల్లంతైన విషయం తెలిసిందే. ఇందులో భరత్‌కుమార్ మృతదేహం మంగళవారమే లభించగా చల్లా రమేశ్ (45) మృతదేహాన్ని రఘునాథపాలెం మండలం వీవీ పాలెం లాక్‌ల వద్ద బుధవారం గుర్తించారు. ఈ మేరకు అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించగా, ప్రసాద్ మృతదేహం కోసం గాలిస్తున్నామని సీఐ భానుప్రకాశ్ తెలిపారు. అయితే, రాత్రి వరకు ఫలితం లేకపోవడంతో గురువారం గాలించాలని నిర్ణయించారు.


ఒకరిని కాపాడేందుకు వెళ్లి..

ఖమ్మం జిల్లా జైలులో ఉన్న మిత్రుడిని చూసేందుకు నలుగురు మణుగూరు నుంచి ఆటోలో సోమవారం వచ్చారు. తిరిగి వెళ్లే సమయాన ఓ బంధువు ఇంట్లో ఆగిన నలుగురు మార్గమధ్యలో సాగర్ కాల్వ వద్ద ఆగారు. అయితే, వెంకన్న ఆటోలో ఉంటానని చెప్పగా మిగతా ముగ్గురు సరదాగా కాల్వలోకి దిగారు. ఈ క్రమాన భరత్‌కుమార్‌కు ఈత రాకపోవడంతో ఆయన మునిగిపోతుండగా కాపాడే ప్రయత్నంలో చల్లా రమేశ్, కట్టా ప్రసాద్ గల్లంతైనట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని మంగళవారం ఉదయం వెంకన్న చెప్పే వరకూ ఎవరూ గుర్తించలేకపోయారు. కాగా, ఇద్దరి మృతదేహాలు లభించగా కట్టా ప్రసాద్ ఆచూకీ కోసం కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు.

ఆ హోంగార్డుకు ఏమీ కాలేదు..

కొత్తగూడెంటౌన్: హోంగార్డు తాండ్ర గోపాల్ మరణించినట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మొద్దని జిల్లా హోంగార్డుల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా రుద్రకరణ్ పోలీస్ స్టేషన్‌లో తాండ్ర గోపాల్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, అక్కడి మల్కాపూర్ చెరువులో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేస్తుండగా గోపాల్‌కు తలకు రాయి తగిలి తీవ్ర గాయమైంది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో మెరుగైన చికిత్స కోసం పోలీసులు గచ్చిబౌలిలోని ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం గోపాల్ ఆరోగ్యం నిలకడగా ఉందని, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతో ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు.

లారీ బోల్తా.. డ్రైవర్ మృతి


నవీన్‌కుమార్ (ఫైల్)

చంద్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామం వద్ద జాతీయ రహదారి మలుపు వద్ద బుధవారం తెల్లవారుజామున లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఏనుగు నవీన్‌కుమార్ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ గంజి స్వప్న కథనం ప్రకారం.. ఏపీ రాష్ట్రం రేణిగుంట నుంచి మిషన్ భగీరథ పైపుల లోడుతో వస్తున్న లారీ మార్గమధ్యలో అయన్నపాలెం వద్ద ప్రమాదానికి గురవడంతో డ్రైవర్ మృతిచెందాడు. మృతుడి బాబాయ్ అనంతరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం కొత్తగూడెంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ యాయతి రాజు కథనం ప్రకారం .. దమ్మపేటకు చెందిన పి.రాంప్రసాద్ (32) ద్విచక్రవాహనంపై మంగళవారం అశ్వారావుపేట వైపు వస్తున్న క్రమంలో మండలంలోని రామచంద్రాపురం గుట్ట దగ్గర ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను కుటుంబీకులు ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రాంప్రసాద్ మృతితో దమ్మపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.